క్లుప్తంగా

పెద్దమ్మా ఆశీర్వదించు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్బ్యాగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. చీరలు, గాజులు, నిమ్మకాయలు, పిండివంటలు అమ్మవారికి మొక్కుగా చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, శంకరయ్య, చిన్నపెద్దన్న, చిన్నన్నలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్ని సౌకర్యాలు కల్పించారు. ఆది, మంగళవారాల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అలాగే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దర్శన వేళలు ఉంటాయన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులకు సూచనస్తున్న ఏఎస్ఐ మౌలాలి

దొర్నిపాడు: ఎగువ ప్రాంతం నుంచి కుందూనదికి భారీగా వరద నీరు వస్తుందని గ్రామస్తులంతా అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ మౌళాలి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం క్రిష్టిపాడు గ్రామంలో పర్యటించి ప్రధాన కూడళ్లలో మాట్లాడారు. కుందూనది ఉధృతంగా ప్రవహిస్తుందని వంతెన పూర్తిగా మునిగి పోయిందన్నారు. దీంతో రైతులు అవసరం నిమిత్తం వంతెనపై వెళ్లరాదని హెచ్చరించారు. అలాగే కుందూనది ఆనుకొని ఉన్న వారంతా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఏదైనా విపత్తు సంభవిస్తే వెంటనే అధికారులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

1,550 హెక్టార్లలో ఖరీఫ్ పంటల సాగు



ఉయ్యాలవాడలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ

ఉయ్యాలవాడ: ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 2,675 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 1,550 హెక్టార్లలో పంటలు సాగైనట్లు ఏఓ రాజేంద్రకుమార్ తెలిపారు. వరి 570 హెక్టార్లు, మొక్కజొన్న 266, పత్తి 207, మినుము 124, సోయాబీన్ 18, మిరప 28, పొగాకు 4, వేరుశనగ 8, కొర్ర, బెండ, బంతిపూలు, ఇతర పంటలు కలిపి 30 హెక్టార్లలో వేశారన్నారు. ఇందులో ఇప్పటి వరకు 685 హెక్టార్లలో ఈ క్రాప్ నమోదు చేశామన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ఖరీఫ్ పంటలు సాగుకు అవకాశం ఉందన్నారు.

ముగిసిన గణపతి గాథలు ప్రవచనాలు

శ్రీశైలంటెంపుల్: విఘ్నసంహారకుడిగానే కాకుండా సర్వభీష్టాలను తీర్చే దైవంగా గణపతి పేరొందారని ప్రముఖ ప్రవాచకులు సామవేదం షణ్ముఖశర్మ తెలిపారు. హిందూ ధర్మ ప్రచారములో భాగంగా శ్రీశైల దేవస్థానం తొమ్మిదిరోజుల పాటు గణపతి గాథలపై నిర్వహించిన ప్రవచనాలు ఆదివారం ముగిశాయి. ఈ ప్రవచనాల్లో సందర్భానుసారంగా శ్రీశైల క్షేత్ర మహిమ, విశేషాలు, వేదసంస్కృతి, సనాతన ధర్మం, ఆచారాలు, సంప్రదాయాల గురించి కూడా వివరించారు. అనంతరం ప్రవచనకర్తను ఈఓ ఘనంగా సత్కరించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు, జ్ఞాపిక అందజేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో జీవిస్తున్న చిన్నారులకు నేస్తం జిల్లా స్థాయి పాజిటివ్ నెట్‌వర్క్‌లోని కేర్ సపోర్ట్ సెంటర్‌లో ఎడ్యుకేషన్ మెటీరియల్ పంపిణీ చేశారు. స్థానిక బుధవారపేటలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి చైతన్య కళాభారతి స్వచ్ఛంద సంస్థ(నంద్యాల) ప్రెసిడెంట్ వి.విజయభాస్కర్, జి.వరలక్ష్మి సహకారం అందించారు. ముఖ్యఅతిథి డాక్టర్ ఎం.సుబ్బరాయుడు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఎంఅండ్ఈ జె.దేవీశంకర్‌గౌడ, నేస్తం సంస్థ అధ్యక్షులు బి.సుధారాణి, వైఆర్‌జీ కేర్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉమామహేశ్వరుడి కల్యాణం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వరుని కల్యాణోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ఏకశిలా రూపంలో కొలువైన ఉమా మహేశ్వరస్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ చేసి మహా మంగళహారతులు ఇచ్చారు. సాయంత్రం ఆలయ ఆవరణలో శివపార్వతుల ఉత్సవమూర్తులను వధూవరులుగా ముస్తాబు చేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



దొర్నిపాడు..క్రిష్టిపాడు వద్ద వరి పొలాల్లోకి చేరిన వరదనీరు



ఉయ్యాలవాడ.. ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది



రుద్రవరం.. చిలుకలూరు వకిలేరు వాగును పరిశీలిస్తున్న శిరివెళ్ల సీఐ

ముంచెత్తిన వరద

- ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ
- ఉప్పొంగిన వాగులు, వంకలు
- నీట మునిగిన పంట పొలాలు
- నిలిచిపోయిన రాకపోకలు

ఉయ్యాలవాడ/దొర్నిపాడు/రుద్రవరం: కొద్ది రోజులుగా కురుస్తున్న వానలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కుందూ నది ఉగ్రరూపందాల్చింది. శ్రీశైల జలాశయానికి భారీగా వరద నీరు చేరడంతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా అధికారులు నదికి 30 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో గంటగంటకు నదిలో నీటి ఉధృతి పెరుగుతోంది. ఇప్పటికే భారీ వరదనీటితో ఉయ్యాలవాడ, రుద్రవరం, దొర్నిపాడు, చాగలమర్రి మండలాల పరిధిలోని నదితీర ప్రాంతాల పంటపొలాలు జలమయమయ్యాయి. వ్యవసాయ పంపుసెట్లు నీట మునిగాయి. ఉయ్యాలవాడ మండల పరిధిలోని హరివరం, నర్సిపల్లె, బోడెమ్మనూరు, సుద్దమల్ల, ఉయ్యాలవాడ, ఆర్.జంబులదిన్నె, కాకరవాడ, ఒంటెద్దుపల్లె గ్రామాల్లో ఖరీఫ్ కింద వందలాది ఎకరాల్లో సాగు చేసిన వరి, పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటలు నీటిలో మునిగిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామాన్ని కుందూనది నీరు చుట్టేసింది. నదిపై ఉన్న బ్రిడ్జి పూర్తిగా మునిగిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. రుద్రవర మండలంలో వకిలేరు వాగు ఉధృతికి రుద్రవరం–శిరివెళ్ల, పేరూరు–ఎర్రగుంట్ల, ఎర్రగుడిదిన్నె–జాతీయ రహదారి, చిలుకలూరు–బత్తలూరు గ్రామాల మధ్య కూడా అదే పరిస్థితి నెలకొంది. ఆయా మార్గాల్లో రాకపోకలను నిలిపేస్తూ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నదితీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రాకూడదని రెవెన్యూ అధికారులు గ్రామాల్లో దండోర వేయించారు.



ఉయ్యాలవాడ.. హరివరం, నర్సిపల్లె గ్రామాల సమీపంలో నీట మునిగిన పంట పొలాలు



దొర్నిపాడు.. క్రిష్టిపాడు గ్రామాన్ని చుట్టుముట్టిన కుందూనది నీరు



ఉయ్యాలవాడ..ఇంజడు గ్రామం సమీపంలో వర్షపునీటిలో మునిగిన మొక్కజొన్న పంట

షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలి

ఆళ్లగడ్డ: రాష్ట్రవ్యాప్తంగా మొదటి రోజే 94 శాతంపైగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినా సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదని ఏపీ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ అజయ్, కుమార్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్ అన్నారు. మునిసిపల్, మండల అధికారులు వెంటనే నోటీసులు ఉపసంహరించుకోవాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని ప్రభుత్వం చెబుతుంటే స్థానిక అధికారులు మాత్రం తెల్లవారుజామున 3 గంటలకు ప్రారంభించి 5గంటల లోపు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారన్నారు. ఇలా చేయడం ద్వారా ఉద్యోగులు మానసికంగా ఒత్తిడికి లోనై ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పింఛన్ల పంపిణీని కార్యాలయ పని వేళల్లో మాత్రమే చేపట్టేలా మార్పులు చేయాలని కోరారు.

సమస్యలను పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): నందమూరినగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు ప్రసాద్, బాబాఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ నాయకుడు హుసేన్‌సా అధ్యక్షతన పట్టణంలోని నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నందమూరినగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్నపాటి వర్షానికే వీధుల్లో వర్షపునీరు నిలిచిపోతుందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి పై సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వార్డెన్లపై చర్యలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల(అర్బన్): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాజకుమారి హెచ్చరించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాలపై ఆదివారం జిల్లా కలెక్టర్ ఆరా తీశారు.ఇందులో భాగంగా పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల వసతి గృహాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. 1వ వసతి గృహంలో 215 మంది విద్యార్థులకు 21.5 కిలోల చికెన్ కూర ఇవ్వాల్సి ఉండగా 8.5 కిలోల చికెన్ మాత్రమే ఇవ్వడం, 2వ వసతి గృహంలో చికెన్‌కు బదులుగా టమాట కూర తయారు చేయడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇరువురు సంక్షేమ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన మెనూను పాటించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం సమీపంలోని బీసీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసి పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

సంక్షిప్తం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. అలాగే అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల (వ్యవసాయం): నంద్యాల రాయల అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (రోపా) ఆధ్వర్యంలో పేద బలిజ మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ సభ్యులు పసుపులేటి జనార్దన్, కామిని మల్లికార్జున, చెన్నంశెట్టి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హులు ఉపకారవేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్: 919246 279444 సంప్రదించాలన్నారు.

విష పురుగు కాటుతో..

రుద్రవరం: మండల పరిధిలోని చిన్నకంబలూరుకు చెందిన మద్దిలేటమ్మ అనే మహిళా కూలీ విష పురుగు కాటుతో తీవ్ర అస్వస్థతకు గురైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. వ్యవసాయ పనులకెళ్లి జీవనం సాగించే మద్దిలేటమ్మ ఆదివారం ఆమె తోటి కూలీలతో కలిసి పనికి వెళ్లింది. పొలంలో పని చేస్తుండగా గుర్తు తెలియని విషపురుగు కాటేసింది. దీంతో ఆమె కొద్దిసేపటికే తీవ్ర అస్వస్థతకు గురై పడిపోయింది. గమనించిన తోటి కూలీలు వెంటనే బాధితురాలిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆలయానికి వెండి బకెట్ అందజేత

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి రాజంపేట వాస్తవ్యుడు ఎన్.భార్గవ్ మనోహర్ రూ.52 వేలు విలువ చేసే 580 గ్రాముల వెండి బకెట్‌ను కానుకగా సమర్పించాడు. ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలతో సత్కరించారు.

పోస్టర్ల విడుదల

నంద్యాల (వ్యవసాయం): 'నైతికతే నిజమైన స్వేచ్ఛ'పేరుతో సెప్టెంబర్ మాసమంతా సమావేశలు, సభలు నిర్వహించనున్నట్లు జమాతె ఇస్లామీ హింద్ మహిళా విభాగం కన్వీనర్లు ఫదోషబాను, ఆసియా తెలిపారు. ఆ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ మానవ సమాజం అనేక సమస్యలను ఎదుర్కొంటుందన్నారు. మితిమీరిన స్వేచ్ఛకు అలవడటం, పాశ్చాత్య సంస్కృతి వాదాన్ని అనుసరించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. దీనిపై ప్రజలను జాగృతం చేసేందుకు మొరాలిటీ ఈజ్ ఫ్రీడం కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ మజీద్ జకరియా, మోమిన్, హఫీజ్ జమా, సలీం, అబ్బాస్ అలీ, అబుబకర్ సిద్దీఖ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

మిరపలో యాజమాన్య పద్ధతులు



మిరపలో చేరిన వర్షపునీరు

కోవెలకుంట్ల: ఇటీవల కురుస్తున్న వర్షాలతో కోవెలకుంట్ల సబ్ డివిజన్ పరిధిలో సాగైన మిరపలో వర్షపు నీరు నిల్వ చేరిందని, సరైన యాజమాన్య పద్ధతులు పాటించి పంటను కాపాడుకోవాలని ఉద్యానవనశాఖ అధికారిణి ధరణి సూచించారు. వర్షపునీరు నిల్వ చేరిన మిరప పంటను ఆదివారం ఉద్యానవనశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మిరపలో అధికంగా నీరు చేరిన పొలాల్లో లీటరు నీటికి 3 గ్రాముల 19:19:19, ఐదు గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారి చేయాలన్నారు. నారు, మొదలు కుళ్లు తెగుళ్ల నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్, రెండు గ్రాముల మాంకోజెబ్ కలిపి మొదలు తడిచేలా పిచికారీ చేయాలని పేర్కొన్నారు. పంటలో అధికనీరు నిల్వ ఉండకుండా తీసి వేయాలన్నారు. అధిక తేమ శాతం కారణంగా ఉల్లిపైరుకు కుళ్లు తెగులు సోకే అస్కారం ఉందన్నారు. నివారణకు ఎకరాకు ఒక కిలో చొప్పున కార్బండిజమ్, మాంకోజెబ్‌ను ఇసుకలో కలిపి భూమిలో చల్లుకోవాలని సూచించారు. అధిక వర్షాల వల్ల టమాట పంటకు కుళ్లు, బ్యాక్టీరియల్, పంగల్ తెగుళ్లు సోకే అవకాశం ఉందన్నారు. నివారణకు లీటరు నీటికి 5 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి, లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను వేళ్ల కాడ బాగా తడిచేలా పిచికారీ చేయాలని తెలిపారు.

మట్టిమిద్దెల్లో అప్రమత్తంగా ఉండండి



మట్టిమిద్దెలున్న వారితో మాట్లాడుతున్న డీపీఓ మంజులవాణి

జూపాడుబంగ్లా: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మట్టిమిద్దెలు కూలే ప్రమాదం ఉన్నందున వాటిలో నివాసం ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని డీపీఓ మంజులవాణి సూచించారు. ఆదివారం ఆమె బ్రాహ్మణకొట్కూరు, బొల్లవరం, తాటిపాడు, రుద్రవరం గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆమె తాటిపాడు గ్రామానికి చేరుకొని శ్రీశైలం బ్యాక్‌వాటర్ నీటి మట్టాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె గ్రామంలోని మట్టిమిద్దెలను పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ వారికి పంచాయతీ కార్యదర్శి శాంతయ్య ద్వారా నోటీసులు అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కురుస్తున్న వర్షాల ధాటికి గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణానదిలోకి వరదనీటి ప్రవాహం అధికంగా కొనసాగుతున్నందున తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మట్టిమిద్దెలున్న వారు వాటిల్లో నిద్రించకుండా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో నిద్రించాలని సూచించారు. సర్పంచ్ వంగల లక్ష్మీదేవమమ్మ, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి, వంగల కృష్ణారెడ్డి, లక్ష్మన్నగౌడు ఉన్నారు.

స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలి



జెండా ఆవిష్కరణలో రైతు సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి అన్ని పంటలకు మద్దతు ధర కల్పిస్తూ చట్టం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో సెప్టెంబర్ 1 రైతాంగ డిమాండ్ డేగా ప్రకటించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రైతులకు రుణాలు మాఫీ చేసి కేరళ తరహాలో రుణ ఉపశమనం చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు, లక్ష్మన్న, వెంకటనారాయణ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల సమస్యలకు అత్యాధునిక చికిత్స



సదస్సుకు హాజరైన వైద్యనిపుణులు

కర్నూలు(హాస్పిటల్): ఊపిరితిత్తుల సమస్యలకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని వైద్య ప్రముఖులు చెప్పారు. ఆదివారం కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో లంగ్స్ అటాక్ పేరుతో కంటిన్యూస్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) నిర్వహించారు. హైదరాబాద్‌లోని కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రి, కర్నూలు కిమ్స్ ఆసుపత్రుల సహకారంతో కర్నూలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో ఈ సదస్సు ఏర్పాటు చేశారు. ఊపిరితిత్తుల సమస్యలకు చికిత్స, అత్యాధునిక వైద్య విధానాలు, మందులు, వాటితో రోగులకు ఎలా ఊరట లభిస్తుందన్న విషయాలను వివరించారు. కర్నూలు కిమ్స్ నుంచి డాక్టర్ జి.సుధాకర్, వెంకటచలమయ్య, కొండాపూర్ కిమ్స్ – శుభకర్ నాదెళ్ల, అనంతపురం ఆస్పత్రి నుంచి డాక్టర్ యశోవర్ధన్ నిర్వాహకులుగా వ్యవహరించారు. కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి, అనంతపురం, బళ్లారి, రాయచూరు, హైదరాబాద్, మేడ్చల్ తదితర ప్రాంతాల నుంచి వైద్య నిపుణులు హాజరై 150 మంది జూనియర్ వైద్యులు, పీజీ విద్యార్థులకు చికిత్సా పద్ధతులపై అవగాహన కల్పించారు. కర్నూలు కిమ్స్ సీఓఓ డాక్టర్ సునీల్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సులను ఏటా నిర్వహిస్తామని చెప్పారు. టీబీ గుర్తింపు, సత్వర చికిత్స, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ లాంటి సమస్యలకు చికిత్సా విధానాన్ని వివరించారు. ఐఎంఏ కర్నూలు ప్రెసిడెంట్ డాక్టర్ రామచంద్రనాయుడు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వెంకటరమణ, ట్రెజరర్ డాక్టర్ కె.మాధవీశ్యామల, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్, డాక్టర్ జి.శారద పాల్గొన్నారు.

ఓపీఎస్‌నే అమలు చేయాలి



బొమ్మలసత్రం జంక్షన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నంద్యాల(న్యూటౌన్): ఓల్డ్‌పెన్షన్ స్కీంను మళ్లీ అమలు చేయాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, కేవీ శివయ్య డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెన్షన్ విద్రోహ చీకటి దినంగా అభివర్ణిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ పెట్టుబడులకు తలొగ్గి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ పేర్లతో ఉపాధ్యాయులను మభ్యపెట్టడం సమంజసం కాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల ఏకైక నినాదం ఓపీఎస్ అమలే అన్నారు. పెన్షన్ అనేది తమ హక్కు అని దాని తీసివేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు జాకీర్ హుస్సేన్, సుకుమాంబకుమారి, తిమ్మారెడ్డి, వీరేశ్వరరెడ్డి దస్తగిరి భాషా, శ్రీనివాసులు, జమాల్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని

నంద్యాల (న్యూటౌన్): పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని పట్టణంలోని బొమ్మలసత్రం జంక్షన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఏపీసీపీఎస్ఈఏ నాయకులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, నాయకులు రామనరసింహ, పుల్లయ్యనాయక్, రవితేజ పాల్గొన్నారు.

- కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన యూపీఎస్‌ను వ్యతిరేకిస్తూ ఎస్టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మౌలాలి, అజాంబేగ్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు శివశంకర్, గోపాలకృష్ణ, చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు పెన్షన్ భద్రత కల్పించకపోవడం శోచనీయమన్నారు.

వర్షాకాలం... విద్యుత్‌తో భద్రం

- తడిచేతులతో తీగలు, స్విచ్‌లు తాకితే ప్రమాదం
- నాణ్యమైన విద్యుత్ పరికరాలను వాడాలి
- విద్యుత్ అధికారులు సూచనలు



గోస్పాడు విద్యుత్ సబ్ స్టేషన్

గోస్పాడు: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఇళ్లు, కార్యాలయాలు, వ్యవసాయ బావుల వద్ద ముప్పు పొంచి ఉంటుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా... ప్రాణ, ఆస్తి నష్టాలు చోటుచేసుకునే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు సూచిస్తున్నారు.

వైరింగ్ ప్రధానం

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే నివాసాలు, పరిశ్రమల్లో వైరింగ్ ముఖ్యం. విద్యుత్ వస్తువుల సామర్థ్యాన్ని అంచనా చేసుకోవడంతో పాటు భవిష్యత్ అవసరాలు తీర్చేలా పటిష్టమైన నాణ్యమైన రాగి తీగలు కలిగిన వైర్లను వినియోగించాలి. వైరింగ్ రంధ్రాల్లో ఎలుకలు, వర్షం నీరు చేరకుండా చూసుకోవాలి. శిక్షణ పొందిన ఎలక్ట్రీషియన్లతో వైరింగ్ చేయించుకోవాలి.

నాణ్యమైన పరికరాలు కొనుగోలు చేయాలి...

విద్యుత్ సంబంధ పరికరాలు, వైర్లు, వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు తదితరవి నాణ్యంగా ఉండేలా చూసుకోవాలి. గుర్తింపు కలిగిన వాటినే కొనుగోలు చేయాలి. అలాగే వ్యవసాయ పంపుసెట్లు, స్టార్టర్లు నివాసాలకు వైరింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా ఎర్తింగ్ చేయించాలి.

తీసుకోవాల్సిన మరికొన్ని జాగ్రత్తలు....

- కరెంటు పనులను అనుభవం ఉన్న వారితో చేయించుకోవాలి. ఐఎస్ఐ మార్కు కలిగిన వైర్లు, స్విచ్లు, ఇతర పరికరాలను వాడాలి.
- విద్యుత్ నియంత్రికల వద్ద అనధికారికంగా ఫ్యూజులు వేయడం, మరమ్మతులకు పూనుకోవడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం ప్రమాదకరం.
- సమస్యలుంటే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలి.
- విద్యుదాఘాతం సంభవిస్తే వెంటనే కరెంట్ సరఫరా ఆపివేసి ప్లాస్టిక్ వస్తువు, ఎండు కర్రతో ప్రమాదం జరిగిన వ్యక్తిని వేరు చేయాలి.
- వర్షం కురుస్తున్న సమయంలో స్తంభాలను తాకరాదు. తీగలు తెగిపడితే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.
- కూలర్‌లో నీటిని నింపే సమయంలో తప్పనిసరిగా కరెంటు సరఫరా నిలిపివేయాలి.
- విద్యుత్ పరికరాలు, తీగలపై దుస్తులు ఆరబెట్టరాదు.
- నాణ్యమైన సెల్‌ఫోన్ చార్జర్లనే ఉపయోగించాలి. స్నానం చేశాక తడి చేతులతో సెల్‌ఫోన్‌ను చార్జర్ నుంచి తీయరాదు

అప్రమత్తతో ప్రమాదాల నివారణ



వర్షా కాలంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. ఈ సీజన్‌లో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలకు గురికావాల్సి వస్తుంది. ముందుస్తుగా మేము ప్రధాన లైన్లకు సంబంధించి ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేపడుతున్నాం. ఎక్కడైనా విద్యుత్ సంబంధ సమస్యలు తలెత్తితే వెంటనే మాకు తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– జ్ఞాన సూర్యుడు, విద్యుత్ ఏఈ, గోస్పాడు